క్లుప్తంగా

నేడు గూడూరుకు ఎమ్మెల్సీ మేరిగ



గూడూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మేరిగ మురళీధర్ ఆదివారం గూడూరుకు రానున్నారు. ఈ మేరకు ఆయనకు గూడూరు రైల్వే స్టేషన్‌లో స్వాగతం పలికేందుకు, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈక్రమంలో రైల్వేస్టేషన్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి, డాక్టర్ సీఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో ఆత్మీయ సన్మానసభ నిర్వహించనున్నారు. ఈ మేరకు గూడూరు పట్టణంతోపాటు, నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరానున్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

గూడూరు: ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఆర్‌ఐఓ, ఇంటర్మీడియట్ పరీక్షల కన్వీనర్ టి.వరప్రసాద్‌రావు శనివారం తనిఖీ చేశారు. ఆయన పరీక్ష కేంద్రంలోని అన్ని గదుల్లోనూ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను, కేంద్రం వద్ద వసతులను ఆయన పరిశీలించారు. కేంద్రంలో 255 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా, 248 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ నరసింహారావు

వాకాడు: వాకాడు మండల నూతన తహసీల్దార్‌గా ఎస్‌వీ నరసింహారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఏడు నెలల ముందు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పద్మావతిని పెళ్లకూరు మండలానికి బదిలీ చేశారు. అప్పటి నుంచి తహసీల్దార్‌ని నియమించకపోవడంతో డీటీ సారంగపాణి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పనిచేశారు. ఏడు నెలల తరువాత విజయవాడ సీసీఎల్ నుంచి నరసింహారావును వాకాడు తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

నష్టపరిహారం పెంచాలి

కోట: సాగరమాల రోడ్డు నిర్మాణం కోసం సేకరించిన భూములకు వెంటనే నష్టపరిహారం పెంచి చెల్లించాలని కొత్తపాళెం రైతులు శనివారం తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ ఊనుగుంటపాళెం, విద్యానగర్, కొత్తపాళెం, అగ్రహారం మీదుగా సాగరమాల రోడ్డు నిర్మాణం కోసం అధికారులు భూములు సర్వే చేసి సిద్ధం చేసినట్లు తెలిపారు. నష్టపరిహారం చెల్లించడంలో జాప్యం జరుగుతోందన్నారు. ఎకరాకు రూ.25 లక్షలు చెల్లించాలని రైతులు కోరుతుండగా ల్యాండ్ రిజిస్ట్రేషన్ విలువ మేరకు రూ.9.50లక్షలు ఇవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇక్కడున్న భూముల ధరలకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలని తాము కోరుతున్నట్లు రైతులు తెలిపారు.

ప్రజాభిప్రాయాలను అమలు చేయాలి



మాట్లాడుతున్న జేసీ కలెక్టర్ రోణంకి



హాజరైన జనం

- మైనింగ్ క్వారీలపై ప్రజాభిప్రాయం
- జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్

సైదాపురం: ప్రజల అభిప్రాయాలను అమలు చేయాల్సిన బాధ్యత మైనింగ్ యజమానులపైనే ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. మండలంలోని తురిమెర్ల గ్రామ సమీపంలో శనివారం సబ్‌లైన్ మైకా ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ ఆధ్వర్యంలో రెండు గనులకు సంబంధించి 36 హెక్టార్లలో మైనింగ్ నిర్వహించేందుకు పర్యావరణపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తురిమెర్ల గ్రామంలో 29.226 హెక్టార్లలో ఓపెన్ కాస్ట్, అలాగే మరో 7 హెకార్లలో కూడా ఓపెన్ కాస్ట్ మైనింగ్ కార్యకలాపాలను నిర్వహించేందుకు పర్యావరణం అనుమతి కోసం ప్రజాభిప్రాయ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. అలాగే ఈ సభల ద్వారా ప్రజలు తెలిపిన అభిప్రాయాలను కమిటీ ముందుంచుతామన్నారు. నిర్భయంగా తమ సమస్యలను చెప్పుకోవచ్చన్నారు.అనంతరం పలువురు మైనింగ్ చేసేందుకు అనుమతులు మంజూరు చేయాలంటూ వినతిపత్రాలను జేసీకి అందజేశారు. అనంతరం ప్రజలు, నాయకులతో పాటు పలు స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు పలు సమస్యలను కమిటీ ముందుంచారు. పర్యావరణాన్ని కాపాడుకుని పరిశ్రమలు అభివృద్ధి సాధించడంతో పాటు గ్రామాభివృద్ధికి యాజమాన్యం చర్యలను చేపట్టాలన్నారు. ప్రజల మనోభావాలను పరిగణంలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. కార్యక్రమంలో ఎన్విరాల్‌మెంట్ అధికారి రాజశేఖర్, గని యజమాని ప్రణయ్‌రెడ్డి, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎస్‌ఐ నాగబాబు, ఆర్‌ఐ అశ్వర్థనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను ఆదుకోవడం అభినందనీయం



సామగ్రిని అందజేస్తున్న దాత

గూడూరు: దాతలు ముందుకొచ్చి అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన సామగ్రిని ఆదుకోవడం ఎంతో అభినందనీయమని ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్‌కే మెహబూబా పేర్కొన్నారు. పట్టణంలోని సాధూపేట, పూలతోట గిరిజన కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన రైస్ కుక్కర్, కుర్చీలు, పలక లు, చార్టులు ఇతర సామగ్రిని ఆర్వీ కన్‌స్ట్రక్షన్స్ అధినేత వెంకటకృష్ణయ్య, రేష్మల దాతృత్వంతో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో అందజేశారు. సంస్థ అధ్యక్షుడు కే చంద్రశేఖర్, జ్యోతికిరణ్, ఆశాబేగం, సురేంద్రరెడ్డి, చంద్రశేఖర్, కే శ్రీనివాసులు, వీ రామ్మోహన్‌రావు, రాము, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

న్యాయం చేయండి

నాయుడుపేటటౌన్: నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో మత్స్య మాంస దుకాణాదారుల నుంచి కాంట్రాక్టర్ ఎక్కువ రుసుము వసూలు చేస్తున్నారని, వారికి న్యాయం చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ కమిషనర్‌ను కోరారు. మున్సిపాలిటీలో వ్యాపారాలు చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యాజమానులతో కలిసి శనివారం కమిషనర్ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపికకు కూడా వినతి పత్రాన్ని అందించారు.

సద్వినియోగం చేసుకోండి

గూడూరు: ప్రభుత్వ సెలవు రోజుల్లో తప్ప మిగిలిన అన్ని పనిదినాల్లోనూ ప్రతి సచివాలయంలోనూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ స్పందన అర్జీలను స్వీకరిస్తామని ఆర్డీఓ కిరణ్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కొద్ది రోజులుగా స్పందన కార్యక్రమం నిర్వహించలేదని పేర్కొన్నారు. 20వ తేదీ నుంచి ఇకపై ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సచివాలయాల్లో కూడా అర్జీలు అందజేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

వంద శాతం పన్ను వసూళ్లకు చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులకు సంబంధించి పాత బకాయిలు వంద శాతం వసూలు చేయాలని కమిషనర్ శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం 13 వార్డు సచివాలయాలకు సంబంధించి అడ్మిన్‌లు. కార్యదర్శులు, బిల్‌కలెక్టర్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. మున్సిపల్ మేనేజర్ ఎంకే ఖాజామొహిద్దీన్, ఆర్‌ఐ షాజహాన్ ఉన్నారు.

రావులపాడు సర్పంచ్‌కు మాతృవియోగం

పెళ్లకూరు: రావులపాడు పంచాయతీ సర్పంచ్ గుంజి మాతయ్య మాతృమూర్తి గుంజి శంకరమ్మ(78) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు మాతయ్య కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

వైభవంగా పరమేశ్వరీ విగ్రహ ప్రతిష్ట



వెంకటగిరి: పట్టణంలోని నరసింహరావువీధి మాతా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో శనివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠోత్సవం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ఉదయం విశేష హోమాలు నిర్వహించారు. అనంతరం యంత్రస్థాపన, విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

పెంచలకోనలో వేలం పాటలు



రాపూరు: పెంచలకోన దేవస్థానంలో శనివారం ఏప్రిల్ 1నుంచి వచ్చే సంవత్సరం మార్చి 31 వరకు టెంకాయలు, పూజాసామగ్రి, కొబ్బరిచిప్పలు పోగుచేసుకునే హక్కుకు బహిరంగ వేలం పాటలు నిర్వహించినట్లు ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. పూజాద్రవ్యాలు విక్రయించేందుకు రూ.65లక్షల 55 వేలకు పాట దక్కించుకున్నారని, కొబ్బరిచిప్పలు పోగుచేసుకునే హక్కుకు రూ.34లక్షలకు దక్కించుకున్నారని తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.17లక్షల 26వేలు ఆదాయం వచ్చినట్లు వివరించారు. ఈవేలం పాటల్లో దేవస్థాన ప్రధానార్చకులు సీతారాయయ్యస్వామి, త్రినాథ్‌స్వామి పేర్కొన్నారు.

ఆత్మీయ కలయిక



గూడూరు: అసెంబ్లీ ఆవరణలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ప్యానల్ వైస్ చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు సీఎంకు ఆయన కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారని తెలిపారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న బల్లి కల్యాణ్ చక్రవర్తి

22న ఉగాది వేడుకలు



ప్రత్యేక అలంకరణలో చెంగాళమ్మ

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు పాలకమండలి చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తెలిపారు. స్వస్తిశ్రీ చాంద్రమాన శోభకృత్ నామ సంవత్సరం చైత్ర శుద్ధ పాడ్యమి సందర్భంగా ఈనెల 22న బుధవారం అమ్మవారి మూలవిరాట్‌కు స్వర్ణ కిరీటం, చందనాలంకరణ, శోభిత చెంగాళమ్మ దివ్య దర్శనం భక్తులకు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 9 గంటలకు కలశస్థాపన, 10 గంటలకు లక్ష కుంకుమార్చన పూజ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. లక్ష కుంకుమార్చన పాల్గొనదలచిన భక్తులకు దంపతులు తమ పేర్లను ఆలయం వద్ద నమోదు చేయించుకోవాలని తెలిపారు. నూతన తెలుగు సంవత్సరాది వేడుకల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని వారు కోరారు.

బాధితుడికి ఆర్థికసాయం



చెక్కును అందజేస్తున్న నేతలు

రాపూరు: పంగిలి గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధిగ్రస్తుడు పంద్యాల కోటేశ్వరావుకు ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకులు మెట్టుకూరు ధనంజయరెడ్డి ఎంసీ ఫౌండేషన్ ద్వారా స్థానిక వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో శనివారం రూ.25 వేల చెక్కును అందజేశారు. నేతలు నల్లవడ్ల వెంకటరమణారెడ్డి, మధురెడ్డి, పెంచ లయ్య, మోహన్, వెంకటేశ్వర్లు, వినయ్ పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ మృతి



చంద్రశేఖర్ రాజు(ఫైల్)

కలువాయి: ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో హెడ్ కానిస్టేబుల్ మృతిచెందాడు. ఈ ఘటన చవటపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. అనంతసాగరం మండలం సోమశిల పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఎస్. చంద్రశేఖర్‌రాజు. ఆయన విధి నిర్వహణలో భాగంగా నెల్లూరు నుంచి సోమశిలకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. చవటపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో రోడ్డుకు అడ్డంగా కూలిన తాటి చెట్టును ద్విచక్రవాహనం అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని పొదలకూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అడవులను సంరక్షించుకోవాలి

రాపూరు: రాపూరు రేంజ్ పరిధిలోని అడవులను సంరక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని రేంజర్ రవీంద్రబాబు తెలిపారు. గుండవోలు, మల్లమ్మగుంట, పంగిలి గ్రామంలో శనివారం అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

దరఖాస్తు చేసుకోండి

చిల్లకూరు: డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో చేరేందుకు ఈనెల 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చిల్లకూరు గురుకుల కళాశాల ప్రిన్సిపల్ మీరా సాహెబ్ కోరారు. చిల్లకూరులోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శనివారం పొదుపు గ్రూప్ సభ్యులకు గురుకుల పాఠశాలలో జరిగే విద్యా బోధనపై అవగాహన కల్పించారు. ఏపీఎం గున్నయ్య పాల్గొన్నారు.